సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
06-08-2025
పేజీలు: 02




# నిర్మల్ లో అత్యాచారం... అల్లుడిని చంపిన అత్త

మద్యం మత్తులో అత్తపై అత్యాచారం చేయడంతో అల్లుడిని వృద్ధురాలు హత్య చేసింది. ఈ సంఘటన నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలో ఓ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం--- మహారాష్ట్రకు చెందిన షేక్ నజీం(45) తన భార్య, కుమారుడు, అత్తమ్మతో కలిసి ముథోల్ మండలంలో ఓ గ్రామంలో నివాసం ఉంటున్నారు. నజీం మద్యానికి బానిసగా మారి తన కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడు. నజీం భార్యకు పది రోజుల క్రితం మహారాష్ట్రలో కూలీ పనులు దొరకడంతో తన కుమారుడితో కలిసి ఆమె అక్కడికి వెళ్లింది. ఇంట్లో అత్త, అల్లుడు మాత్రమే ఉంటున్నారు. రెండో రోజుల క్రితం మద్యం తాగి అత్తపై అత్యాచారం చేశాడు. ఈ క్రమంలో ఆమె గాయపడడంతో స్థానిక ఆస్పత్రిలో చికిత్స తీసుకొని ఇంటికి వచ్చింది. సోమవారం అర్థరాత్రి ఆమెపై అత్యాచారం చేయడానికి ప్రయత్నించాడు. కర్రతో అతడి తలపై అత్త బాది అనంతరం గొంతు నులిమి హత్య చేసింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు గ్రామానికి చేరుకొని కేసు నమోదు చేసి అత్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



## బిర్యానీ, జంక్ ఫుడ్‌కు దూరం

ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఏకంగా ఐదు టెస్టుల్లో ఆడటమే గాక 187 ఓవర్ల పాటు బౌలింగ్ చేసిన టీమ్ఇండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్.. తన ఫిట్‌నెస్‌ను కాపాడుకునేందుకు తీవ్రంగా శ్రమించాడట. ఈ విషయాన్ని స్వయంగా అతడి సోదరుడు మహ్మద్ ఇస్మాయిల్ ఓ జాతీయ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించాడు. ఇస్మాయిల్ మాట్లాడుతూ.. 'అతడు (సిరాజ్) ఫిట్‌నెస్‌పై ఎక్కువగా దృష్టి సారించాడు. జంక్ ఫుడ్‌ను తినడం పూర్తిగా మానేశాడు. హైదరాబాద్‌లో ఉన్నా ఎప్పుడో ఒకప్పుడు బిర్యానీ తినేవాడు. అది కూడా ఇంట్లో చేసిందే తప్ప బయటది తిన్లేదు. పిజ్జాలు, చిరుతిళ్లకు పూర్తిగా దూరంగా ఉంటూ కఠినమైన డైట్ పాటించాడు' అని తెలిపాడు. చాంపియన్స్ ట్రోఫీకి సెలక్ట్ కాకపోయిన సిరాజ్ నిరాశకు గురికాకుండా జట్టులోకి రీఎంట్రీ ఇచ్చేందుకు మరింత ఎక్కువగా శ్రమించాడని.. ఫిట్‌నెస్‌ను పెంచుకోవడానికి జిమ్‌లో ఎక్కువసేపు గడిపేవాడని ఇస్మాయిల్ అన్నాడు.



## వడ్డీ రేట్లపై ఆర్బీఐ కీలక ప్రకటన

# రెపో రేటు యథాతథం

ఆగస్టు 2025 నెలలో జరిగిన ద్రవ్య పరపతి సమీక్ష సమావేశంలో ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ద్రవ్య పరపతి కమిటీ ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. గతంలో వరుసగా మూడు సమీక్షల సందర్భంగా వడ్డీరేట్లను తగ్గిస్తూ ఆర్‌బీఐ రెండు సార్లు 25 బేసిస్ పాయింట్లు మరియు ఒకసారి 50 బేసిస్ పాయింట్లు మొత్తం మూడు విడతలుగా వడ్డీరేట్లను తగ్గించింది. కానీ, ఈసారి మాత్రం కేంద్ర బ్యాంక్ భిన్నంగా వ్యవహరించింది. రెపో రేటును యథాతథంగా 5.5 శాతం వద్ద కొనసాగించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో వడ్డీరేట్ల విషయంలో "న్యూట్రల్ స్టాన్స్" లేదా తటస్థ దృష్టికోణాన్ని కొనసాగించాలని ఆర్‌బీఐ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. దీని అర్థం ఏమిటంటే, ఆర్థిక పరిస్థితుల ఆధారంగా ప్రస్తుతం వడ్డీరేట్లను పెంచాల్సిన అవసరం లేదని, అలాగే తక్షణంగా వడ్డీరేట్లను తగ్గించాల్సిన అవసరం కూడా లేదని సూచిస్తోంది. ఇది మార్కెట్‌కు స్థిరతను కలిగించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

రెపో రేటు, CRR అంటే ఏమిటి?

రెపో రేటు అనేది వాణిజ్య బ్యాంకులు ఆర్థిక అవసరాల కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) వద్ద రుణం తీసుకునే సమయంలో చెల్లించే వడ్డీ రేటు. ఇది మానిటరీ పాలసీలో ముఖ్యమైన సాధనం. ఇక కాష్ రిజర్వ్ రేషియో (CRR) అనేది బ్యాంకులు తమ మొత్తం డిపాజిట్‌లలో కొన్ని శాతాన్ని తప్పనిసరిగా నగదు రూపంలో ఆర్‌బీఐ వద్ద నిల్వ ఉంచాల్సిన నిబంధన. ఇది బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యతను నియంత్రించడంలో కీలకంగా ఉంటుంది.



# ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన మరో బస్సు

బాపట్ల జిల్లాలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చీరాల-కారంచేడు రహదారిపై ఆర్టీసీ బస్సును ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. రహదారికి పక్కనే ఉన్న కొమ్మమూరు కాలువలోకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లగా.. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి ప్రయాణికులను కాపాడా రు. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. నిద్రమత్తులో రాంగ్ రూట్‌లో ప్రైవేట్ బస్సు డ్రైవర్ రావడంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు.

# ఎన్‌హెచ్65 విస్తరణకు గడ్కరీ గ్రీన్‌సిగ్నల్

రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న జాతీయ రహదారుల మంజూరీపై కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో రోడ్లు, భవనా ల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సుదీర్ఘంగా సమావేశమై చర్చించారు. మంత్రితోపాటు తెలంగాణ ఎంపిలు, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపి జితేందర్ రెడ్డిలు ఈ భేటీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న పలు రహదారులకు సంబంధించి మంత్రి కోమటిరెడ్డి వినతిప త్రం అందించారు. కేంద్రమంత్రి గడ్కరీతో సమావేశం పై మంత్రి కోమటిరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉప్పల్ ఫ్లైఓర్ పనులపై నిరంతరం పర్యవేక్షిస్తున్నానని, వీటితో రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన రహదారుల అందించేందుకు హ్యామ్ విధానంలో ఇప్పటికే రోడ్లను ఎంపిక చేశామని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. మల్కాపూర్ నుంచి విజయవాడ (అమరావతి) వరకు రహదారిని 4 వరుసల నుంచి 6 వరుసలుగా విస్తరించడంతో పాటు స ర్వీస్ రోడ్లను నిర్మించాలని గడ్కరీని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. డెత్ రోడ్డుగా పిలిచే హైదరాబాద్-



టు విజయవాడ రహదారిపై (ఎన్‌హెచ్-65) జూ లై 27 న జరిగిన ప్రమాదంలో ఏపికి చెందిన ఇద్దరు డిఎస్పీల మృతి చెందిన విషయాన్ని గడ్కరీ దృష్టికి మంత్రి కోమటిరెడ్డి తీసుకెళ్లారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తిపై సానుకూలంగా గడ్కరీ స్పందించారు. ఆగష్టు 15 వ తేదీన నిర్వహించే ఫైనాన్స్ మీటింగ్‌లో ఎన్‌హెచ్-65 విస్తరణకు ఆమోదిస్తామని త్వరితగతిన అంచనాలు రూపొందించి పంపాలని, వెంటనే టెండర్లు పిలుస్తామని గడ్కరీ హామీనిచ్చారు.

సోషల్ మీడియాలో ప్రస్తుతం ఒకే ఒక్క పేరు మారుమోగుతోంది... అది కియారా అద్వానీ. తాజాగా విడుదలైన 'వార్ 2' మూవీ నుంచి 'ఆవన్ జవాన్' పాటలో కియారా అద్వానీ బికినీ లుక్‌తో అభిమానులను మైమరిపించింది. జూలై 31న తన పుట్టినరోజు సందర్భంగా ఈ గ్లామర్ సాంగ్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పాటలో కియారా అద్వానీ ఎక్స్‌పోజింగ్ చేసిన విధానం, హృతిక్ రోషన్‌తో రొమాంటిక్ కెమిస్ట్రీ, యూత్‌ను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కేవలం సెకన్ల పాటు కనిపించినా ఆమె బికినీ గ్లామర్, స్టైల్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. ఆమె లుక్స్ చూసిన నెటిజన్స్... దీపికా పదుకొణెను తలపించిందని కామెంట్స్ చేస్తూ వైరల్ చేస్తున్నారు.

# కియారా హాట్ లుక్స్





## ఇంట్రెస్టింగ్ టైటిల్‌తో మంచు మనోజ్ కొత్త సినిమా

టాలీవుడ్ రాకింగ్ స్టార్ మంచు మనోజ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి నేటికి ఆయనకి 21 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సుదీర్ఘ ప్రయాణంలో మంచి విజయాలతో పాటు ఎన్నో ఒడిదుడుకులను కూడా ఎదుర్కొన్నారు. చాలా కాలంగా సినిమాలకి దూరంగా ఉన్న మనోజ్ ఇటీవల భైరవం అనే చిత్రంతో పలకరించాడు. మల్టీ స్టారర్ చిత్రంగా ఈ మూవీ అలరించింది. ఇక ఇప్పుడు మళ్లీ ఒక పవర్‌ఫుల్ సినిమాతో రెడీ అయ్యారు. తాజాగా "డేవిడ్ రెడ్డి" అనే టైటిల్‌తో మనోజ్ 21వ సినిమాను అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని దర్శకుడు హనుమ రెడ్డి యక్కంటి డైరెక్ట్ చేయగా, వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. విడుదలైన టైటిల్ పోస్టర్, మేకర్స్ విడుదల చేసిన సమాచారం ఈ ప్రాజెక్టుపై భారీగా ఆసక్తిని పెంచాయి.

# డిజిటల్ చెల్లింపుల్లో ఘనత

## ఒక్కరోజులో 700 మిలియన్ UPI ట్రాన్సాక్షన్లు




భారతదేశంలో డిజిటల్ చెల్లింపుల్లో విప్లవాత్మక మార్పులు తెస్తున్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (UPI) మరోసారి చరిత్ర సృష్టించింది. 2025 ఆగస్టు 2న ఒకేరోజులో 707 మిలియన్లకు పైగా ట్రాన్సాక్షన్లు నమోదయ్యాయి. ఇది ఇప్పటి వరకు నమోదైన అత్యధిక UPI లావాదేవీల సంఖ్యగా నిలిచింది. గతంలో 2023లో రోజుకు సగటున 350 మిలియన్లు, 2024 ఆగస్టులో 500 మిలియన్లు ట్రాన్సాక్షన్లు జరిగాయి. ఇప్పుడు అది 700 మిలియన్ల మైలురాయిని అధిగమించడం గమనార్హం. ఈ వృద్ధి రేటు చూస్తుంటే, రాబోయే కాలంలో రోజుకు ఒక బిలియన్ లావాదేవీలు సాధించడమూ చాలా దూరంలో లేనిది.ఈ రికార్డు స్థాయి లావాదేవీలతో UPI ఇప్పుడు భారతదేశ వాణిజ్య డిజిటల్ చెల్లింపులలో సుమారు 85% వాటా కలిగి ఉంది. ఇందులో సుమారుగా 62% లావాదేవీలు వ్యాపార లావాదేవీలుగా నమోదవడం గమనార్హం. చిన్న షాపుల నుంచి పెద్ద కంపెనీల వరకు ఈ విధానాన్ని స్వీకరిస్తుండటంతో, డిజిటల్ పేమెంట్స్ వేగంగా విస్తరిస్తున్నాయి.2025 మార్చిలో UPI వేదికగా నెలవారీగా ₹24.77 లక్ష కోట్ల విలువగల 19.8 బిలియన్ ట్రాన్సాక్షన్లు జరిగాయి. అదే మే నెలలో ఈ సంఖ్య ₹25.14 లక్ష కోట్లకు చేరుకుంది, ట్రాన్సాక్షన్ వాల్యూమ్ 1,867.7 కోట్లకు పెరిగింది. ఈ సంఖ్యలు దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులపై ఉన్న ఆధారతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి.ఈ స్థాయిలో పెరుగుతున్న వినియోగం, నగదు లావాదేవీలపై ఆధారాన్ని తగ్గిస్తూ, భారత ఆర్థిక వ్యవస్థను మరింత డిజిటలైజ్ చేసిన మార్గంలో ముందుకు తీసుకెళ్తోంది. వినియోగదారులకు సులభతరమైన, వేగవంతమైన సేవలందుబాటుతో పాటు, వ్యాపారులకు పారదర్శకత, ట్రాన్సాక్షన్ రికార్డింగ్ లాంటి లాభాలు కూడా అందుతున్నాయి. ఒకే రోజులో 700 మిలియన్ల UPI లావాదేవీలు నమోదు కావడం ద్వారా భారతదేశం డిజిటల్ ఆర్థికతను గ్లోబల్ పథంలో నిలిపింది.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్

ఒక్కసారిగా 15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవ్వడంతో నీట మునిగిన అమీర్పేట మెట్రో స్టేషన్ పరిసరాలను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ మంగళవారం పరిశీలించారు. సోమవారం సాయంత్రం భారీ వర్షానికి జూబ్లీహిల్స్, కృష్ణానగర్, యూసుఫ్ గూడ, ఎల్లారెడ్డి గూడ ప్రాంతాలతో పాటు, మధురానగర్, శ్రీనివాస్ నగర్ వెస్ట్ నుంచి భారీగా వరద రావడంతో రహదారిపై నీరు నిలిచిందని స్థానిక అధికారులు కమిషనర్ కు వివరించారు. 40 అడుగుల వెడల్పుతో పై నుంచి వచ్చిన వరద కాలువలు అమీర్పేట - సంజీవరెడ్డి నగర్ ప్రధాన రహదారి దాటే సమయంలో 10 అడుగులకు కుంచించుకుపోవడంతో ఈ సమస్య తలెత్తిందని చెప్పారు. అమీర్పేట మెట్రో స్టేషన్ కింద నిర్మించిన కల్వర్టులో వున్న పైపు లైన్లలో ఒకటి పూడికతో మూసుకుపోవడంతో సమస్య తీవ్రమైందన్నారు. వెంటనే పైపు లైన్లలో పూడికను తొలగించాలని కమిషనర్ సూచించారు. అప్పటికీ సామర్థ్యం సరిపోకపోతే పైన వాహన రాకపోకలకు ఆటంకం కలగకుండా టన్నెల్ మాదిరి పనులు చేపట్టి అదనంగా పైపులైన్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం లకడికాపూల్ ప్రాంతాలను పరిశీలించారు. లకడికాపూల్ చౌరస్తాలో పైపులైన్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కొత్తగా పైపులైన్లు వేస్తున్నప్పుడు బారికేడ్లను ఏర్పాటు చేయాలని.. లేని పక్షంలో ప్రయాణికులకు ప్రమాదకరంగా మారుతుందని సూచించారు. ఈ వర్షాకాలంలో వరద ముంచెత్తకుండా తక్షణ చర్యలతో ఉపశమనం లభించేలా, సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు.



# ఉత్తరాఖండ్‌లో వరద బీభత్సం





ట్రంప్ వైఖరిని తప్పుబట్టిన రిపబ్లికన్ పార్టీ నేత నిక్కీ హేలీ భారత్ విషయంలో సొంత పార్టీ నేత, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై రిపబ్లికన్ పార్టీకి చెందిన కీలక నేత, ఐక్యరాజ్యసమితి మాజీ రాయబారి నిక్కీ హేలీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్న కారణంగా ఆ దేశంపై భారీ సుంకాలు విధిస్తానన్న ట్రంప్ వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. చైనాకు ఒకరకమైన మినహాయింపు ఇచ్చి, బలమైన మిత్రదేశమైన భారత్‌తో సంబంధాలను దెబ్బతీయవద్దని ఆమె ట్రంప్‌కు గట్టిగా హితవు పలికారు.ఈ విషయంపై 'ఎక్స్' వేదికగా నిక్కీ హేలీ స్పందిస్తూ, "భారత్ రష్యా నుంచి చమురు కొనకూడదన్నది నిజమే. కానీ మన ప్రత్యర్థి అయిన చైనా, రష్యా, ఇరాన్‌ల నుంచి పెద్ద మొత్తంలో చమురు కొంటున్నా.. వారికి 90 రోజుల సుంకాల విరామం ఇచ్చారు. అలాంటప్పుడు చైనాకు మినహాయింపు ఇచ్చి, బలమైన మిత్రదేశమైన భారత్‌తో సంబంధాలను కాల్చుకోవద్దు" అని ఆమె స్పష్టం చేశారు.రష్యా యుద్ధానికి భారత్ ఆజ్యం పోస్తోందని, మాస్కో నుంచి చమురు దిగుమతులు చేస్తున్నందుకు 24 గంటల్లోగా భారీగా సుంకాలను పెంచుతామని ట్రంప్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో, సోషల్ మీడియాలో హెచ్చరించిన విషయం తెలిసిందే. ట్రంప్ వ్యాఖ్యలపై భారత్, రష్యాలు తీవ్రంగా స్పందించాయి. అమెరికా చర్యలు "అన్యాయమైనవి, అహేతుకమైనవి" అని భారత అధికారులు ఖండించగా, రష్యా మాత్రం వీటిని "బెదిరింపులు"గా అభివర్ణించింది.ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో అమెరికా-భారత్ వాణిజ్య సంబంధాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయితే, అమెరికాకు భారత్ నుంచి ఎగుమతయ్యే ఫార్మాస్యూటికల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, టెలికాం పరికరాలు వంటి కీలక రంగాలపై తక్షణ ప్రభావం పరిమితంగానే ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రభావాన్ని ఎదుర్కోవడానికి భారత్ వంటి ప్రజాస్వామ్య దేశాలతో బలమైన భాగస్వామ్యం అత్యంత కీలకమని నిక్కీ హేలీ చాలాకాలంగా వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆమె ట్రంప్ వైఖరిని బహిరంగంగా విమర్శించారు.



# టీమిండియాలో నయాజోష్

ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల సుదీర్ఘ సిరీస్‌ను టీమిండియా 2-2తో సమం చేసి పెను సంచలనం సృష్టించింది. సీనియర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, రవిచంద్రన్ అశ్విన్‌లు టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడంతో భారత్‌కు సిరీస్‌లో ఇబ్బందులు ఖాయమని విశ్లేషకులు సయితం ఓ అంచనాకు వచ్చారు. అనుకున్నట్టే తొలి టెస్టు మ్యాచ్‌లో టీమిండియా ఒత్తిడిని తట్టుకోలేక ఓటమి పాలైంది. 373 పరుగుల భారీ లక్ష్యాన్ని సయితం కాపాడుకోవడంలో భారత్ విఫలమైంది. ఈ మ్యాచ్‌లో గెలిచే స్థితిలో ఉండి కూడా పరాజయం చవిచూసింది. ఈ ప్రదర్శన తర్వాత భారత్ సిరీస్‌లో పుంజుకుంటుందని ఎవరూ ఊహించలేదు. కానీ అందరి అంచనాలను తారుమారు చేస్తూ బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్టులో భారత్ రికార్డు విజయాన్ని అందుకుంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అసాధారణ బ్యాటింగ్‌తో టీమిండియాను ముందుండి నడిపించాడు. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ, రెండో ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. శుభ్‌మన్ గిల్ అద్భుత ప్రదర్శనకు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, యశస్వి జైస్వాల్, రిషబ్, కెఎల్ రాహుల్‌లు కూడా తమవంతు సహకారం అందించడంతో బర్మింగ్‌హామ్‌లో టీమిండియా చారిత్రక విజయాన్ని సాధించింది. అయితే లార్డ్ వేదికగా జరిగిన మూడో టెస్టులో భారత్ మళ్లీ తడబాటుకు గురైంది. తొలి ఇన్నింగ్స్‌లో కీలక సమయంలో వికెట్లను చేజార్చుకుని భారీ ఆధిక్యాన్ని అవకాశాన్ని చేజార్చుకుంది. మొదటి ఇన్నింగ్స్‌లో యశస్వ జైస్వాల్, కరుణ్‌నాయర్, నితీశ్ రెడ్డితో పాటు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌లు విఫలమయ్యారు. అయితే రెండో ఇన్నింగ్స్‌లో బౌలర్లు అసాధారణ రీతిలో చెలరేగి పోయారు. సిరాజ్, బుమ్రాలు రెండేసి వికెట్లను పడగొట్టగా, వాషింగ్టన్ సుందర్ నాలుగు వికెట్లతో సత్తా చాటాడు. దీంతో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 192 పరుగులకే కుప్పకూలింది.



# ట్రంప్ మళ్లీ బెదిరింపు..

భారత్‌పై సుంకాల పెంపు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన స్వరాన్ని మరింత పెంచారు. రానున్న 24 గంటల్లో భారత్‌పై సుంకాలను గణనీయంగా పెంచుతామని మంగళవారం అంతర్జాతీయ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. రష్యా నుంచి భారత్ పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేస్తోందని, తద్వారా ఉక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోస్తోందని తన ఆక్రోశాన్ని మరోసారి వెళ్లగక్కారు. భారత్‌పై సుంకాలు పెంచబోతున్నట్లుగా సోమవారం తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. 'వాణిజ్యం విషయంలో భారత మంచి భాగస్వామికాదు. ఆ దేశం మాతో పెద్ద మొత్తంలో వ్యాపారం చేస్తోంది.కానీ మేము ఆ స్థాయిలో చేయడం లేదు. కాబట్టి 25 శాతం సుంకాలు విధించాం. రానున్న 24 గంటల్లో దీన్ని మరింతగా పెంచబోతున్నాం. ఎందుకంటే వారు రష్యానుంచి చమురును కొనుగోలు చేస్తున్నారు. తద్వారా ఉక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోస్తున్నారు. వారు అలా చేస్తూ ఉంటే నేను సంతోషంగా ఉండను' అని ట్రంప్ అన్నారు.

## ఆసియా కప్ రేసులో
# గిల్, జైస్వాల్

యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు ఓపెనర్ యశస్వీ జైస్వాల్, సాయి సుదర్శన్ త్వరలో జరుగబోయే ఆసియా కప్ సెలక్షన్స్‌కు అందుబాటులో ఉండనున్నారు. సెప్టెంబర్ రెండో వారంలో దుబాయ్ వేదికగా మొదలుకాబోయే ఈ టోర్నీ టీ20 ఫార్మాట్‌లో జరుగనుంది. ఆసియా కప్ ముగిసిన వెంటనే భారత్.. స్వదేశంలో వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ ఆడాల్సి ఉంది. జైస్వాల్, గిల్‌ను టీమ్ మేనేజ్‌మెంట్ ఎక్కువగా టెస్టులకే వినియోగిస్తున్నా వాళ్లు గత జూన్‌లో ముగిసిన ఐపీఎల్‌లో అదరగొట్టారు. ఇంగ్లండ్‌తో టెస్టులు ముగిసిన నేపథ్యంలో ఆసియా కప్ ప్రారంభానికి ఇంకా నెలకు పైగా సమయం ఉండటంతో ఈ త్రయం మెగా టోర్నీ ఆడేందుకు ఆసక్తిగా ఉన్నట్టు బోర్డు వర్గాల వినికిడి.

## ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య..
# చెవుల్లో గడ్డిమందు పోసి దారుణ హత్య

భర్త వేధింపులు, వివాహేతర సంబంధం ఈ రెండు కారణాలతో ఒక భార్య తన ప్రియుడితో కలిసి భర్తను అత్యంత దారుణంగా హత్య చేయించింది. మద్యం తాగించి ఆపై చెవుల్లో గడ్డిమందు పోసి కిరాతకంగా అంతమొందించింది. ఈ దారుణ ఘటన కరీంనగర్‌లో సంచలనం సృష్టించింది. ఈ కేసులో పోలీసులు భార్యతో పాటు ఆమె ప్రియుడిని, హత్యకు సహకరించిన మరో వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ కిసాన్‌నగర్‌కు చెందిన ఐలవేణి సంపత్ (45) జిల్లా గ్రంథాలయంలో స్వీపర్‌గా పనిచేసేవాడు. అతనికి భార్య రమ, కొడుకు భరత్ ఉన్నారు. సంపత్ మద్యానికి బానిస కావడంతో నిత్యం ఇంట్లో గొడవలు జరిగేవి. మద్యం మత్తులో భార్యను వేధించడం, కొట్టడం చేసేవాడు. ఇదే సమయంలో భార్య రమకు అదే ప్రాంతానికి చెందిన కర్రె రాజయ్యతో వివాహేతర సంబంధం ఏర్పడింది. భర్త వేధింపులు భరించలేక, ప్రియుడు రాజయ్యతో పెరిగిన సాన్నిహిత్యంతో రమ భర్తను చంపాలని నిర్ణయించుకుంది. జూలై 29న సంపత్ ఎప్పటిలాగే ఇంట్లో గొడవపడి బయటికి వెళ్లిపోయాడు.అదే రోజు రాజయ్య, తన స్నేహితుడు కీసరి శ్రీనివాస్‌తో కలిసి సంపత్‌ను బొమ్మకల్ రైల్వే ట్రాక్ వద్దకు మద్యం పార్టీకి పిలిచాడు. సంపత్ మద్యం మత్తులోకి జారుకున్న తర్వాత రాజయ్య రమకు ఫోన్ చేసి హత్యకు అనుమతి తీసుకున్నాడు. రమ హత్యకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో రాజయ్య, శ్రీనివాస్ తమవెంట తెచ్చిన గడ్డిమందును సంపత్ చెవిలో పోశారు. అది మెదడుకు వ్యాపించటంతో సంపత్ మరణించాడు. హత్య తర్వాత రమ ఏమీ తెలియనట్లుగా నటించి, కొడుకు భరత్, ప్రియుడు రాజయ్యతో కలిసి సంపత్ ఆచూకీ కోసం వెతుకుతున్నట్లు డ్రామా ఆడింది. ఆగస్టు 2న సంపత్ మృతదేహం లభ్యం కావడంతో.. కొడుకు భరత్ తన తండ్రి మృతిపై అనుమానం వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు భరత్ ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు మొదలుపెట్టారు. ముందుగా ఇంట్లో జరిగిన గొడవలు, ఆ తర్వాత రమ ఫోన్ కాల్ డేటాను పరిశీలించారు. రమను గట్టిగా విచారించగా.. ఆమె తన ప్రియుడు రాజయ్య, అతని స్నేహితుడు శ్రీనివాస్‌తో కలిసి భర్తను చంపించినట్లు ఒప్పకుంది.

## ముగ్గురు కూతుళ్లను నరికి చంపి...
# తండ్రి ఆత్మహత్య

అప్పుల బాధ భరించలేక ముగ్గురు కూతుళ్లను నరికి చంపి అనంతరం తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన తమిళనాడు రాష్ట్రం నామక్కల్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాసిపురం గ్రామంలో గోవింద రాజు -భారతి అనే దంపతులు నివసిస్తున్నారు. ఈ దంపతులకు ఒక బాలుడు అనేశ్వరణ్, ముగ్గురు కూతుళ్లు ప్రణతీత(10), రితిక శ్రీ(8), దేవి శ్రీ(6)లు ఉన్నారు. అతడు 14 లక్షల రూపాయలు అప్పులు చేశాడు. అప్పులు తీర్చడానికి ఉపాధి నిమిత్తం కేరళకు వెళ్లాడు. ప్రతి నెల ఇఎంఐలు రూ.48000 కట్టలేక ఇబ్బందుల్లో ఉన్నాడు. పీకల్లోతు అప్పుల్లో కూరకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక చావే శరణ్యమని అనుకున్నాడు. వెంటనే ముగ్గురు కూతుళ్లను దారుణంగా నరికి చంపి అనంతరం తండ్రి విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.



## పాలక్ తివారీ
# హాట్ లుక్స్

శ్వేతా తివారీ నట వారసురాలిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన పాలక్ తివారీ ఆ తర్వాత తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. పాలక్ కు సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది. అమ్మడు ఏం షేర్ చేసినా అది క్షణాల్లో నెట్టింట వైరల్ అవుతూ ఉంటుంది. తన ఫాలోవర్లకు రెగ్యులర్ గా గ్లామర్ ట్రీట్ ఇచ్చే పాలక్ తివారీ తాజాగా మరోసారి బికినీ ట్రీట్ ఇచ్చింది. గులాబీ కలర్ క్రోచెట్ ఓవర్‌లే టాప్ దానికి మ్యాచింగ్ మినీ స్కర్ట్ ధరించి బీచ్ సైడ్ నిలబడి ప్రకృతి అందాలను డామినేట్ చేస్తూ కనిపించగా, ఆ ఫోటోలకు నెటిజన్లు లైకుల వర్షం కురిపిస్తున్నారు.